

యువతకు ఉచిత శిక్షణ

ప్రజాశక్తి-విజయనగరంకోట

ఎస్‌బిఐ మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో స్టేట్ స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ సహకారంతో ఎనిమిదో తరగతి చదివిన 18 నుండి 40 సంవత్సరాల వయసు గల నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ నిర్వహించనున్నట్లు జిల్లా మేనేజర్ బి.రెబెక్కా శామ్యూల్ ఒక ప్రకటనలో తెలిపారు. అసిస్టెంట్ బ్యూటీ థెరపిస్ట్ కోర్సుకు 60 రోజులు, హ్యాండ్ ఎంబ్రాయిడర్ కోర్స్, జ్యూట్ బ్యాగుల తయారీకి 45 రోజులు శిక్షణ ఉంటుందన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు తగిన అర్హతలతో ఈనెల 26 లోపు దరఖాస్తు చేసుకోవాలని ఆమె తెలిపారు. శిక్షణ కార్యక్రమాల ద్వారా మహిళలకు ఉపాధి అవకాశాలు, స్వయం ఉపాధి కల్పన ప్రధాన లక్ష్యంగా శిక్షణ ఇస్తున్నామని తెలిపారు.

ఎరువుల కోసం రైతుల బైఠాయింపు

ప్రజాశక్తి - గుర్ల

యూరియా కోసం రైతులు మంగళవారం రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. ఎడిఎ చెప్పిన మాట ప్రకారం యూరియా ఇస్తారని తెల్లవారేసరికి రైతులంతా గుర్ల డీలర్ వద్దకు చేరుకున్నారు. యూరియా కావాలని డీలర్‌ను అడగడంతో సంబంధిత డీలర్ వ్యవసాయ అధికారుల వద్దకు వెళ్లి స్లిప్‌లు రాయించుకొని రావాలని రైతులకు చెప్పారు. రైతులంతా వ్యవసాయ కార్యాలయానికి వెళ్లారు. ఇక్కడ స్లిప్‌లు ఇవ్వడం లేదని, డీలర్ వద్ద ఎరువులు ఉన్నాయి అక్కడ ఇస్తారని చెప్పడంతో రైతులు అక్కడకు మళ్లీ వెళ్లారు. అక్కడ కూడా ఇవ్వకపోవడంతో అధికారులు, డీలర్ తీరుపై విసుగెత్తిని రైతులు నిస్సహాయ స్థితిలో రోడ్డు పై బైఠాయించి నిరసన తెలిపారు. యూరియా కోసం వస్తే అటు అధికారులు, ఇటు డీలర్ తమతో ఆడుకుంటున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. సకాలంలో యూరియా ఇవ్వకపోతే ధర్నాని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.



ఎరువుల కోసం రహదారిపై బైఠాయించిన రైతులు

దీంతో ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. ఒక్క కానిస్టేబుల్ మాత్రమే రావటంతో రైతులను అదుపు చెయ్యలేకపోయారు. దీంతో రైతుల మధ్య తోపులాట జరిగింది. రైతులందరికీ సరిపడ్డ యూరియా వచ్చినప్పుడు మాత్రమే పంపిణీ చెయ్యాలని కొంత మంది రైతులు ఎఒ సిబి యశ్వంత్‌రావును కోరారు. దీంతో యూరియా పంపిణీని నిలిపివేశారు. ఫలితంగా యూరియా కొరత తీరేది ఎప్పుడు? పంటలు పండేది ఎప్పుడు? అని అన్నదాతలు నిరాశతో ఇంటి ముఖం పట్టారు. కాగా తలతంపర, బిల్లానిలోని 10మెట్రిక్ టన్నుల యూరియాను రైతు సేవా కేంద్రం ద్వారా పోలీసుల సమక్షంలో తహశీల్దార్ బి.సుదర్శన్‌రావు, ఎఒ సి.బి యశ్వంత్ రావు ఆధ్వర్యంలో రైతులకు పంపిణీ చేశారు.

యూరియా కోసం తలుపులు తోసేసి..

సంతకవిటి : మండలం లోని సిరిపురం రైతు సేవా కేంద్రానికి మంగళవారం 10 మెట్రిక్ టన్నుల యూరియా రావటంతో రైతులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. రైతులకు చాలీచాలని 224 యూరియా బస్తాలు రావటంతో యూరియా అందుతుందో లేదో అని అన్నదాతలు ఒక్కసారిగా రైతు సేవా కేంద్రం తలుపులు తోసి లోపలికి చొరపడ్డారు.



సంతకవిటి : రైతు సేవా కేంద్రం వద్ద రైతుల తోపులాట

సర్వీస్ సెటిల్‌మెంట్ వద్దు... ఉపాధే కావాలి

మైన్స్ కార్మికుల నిరవధిక నిరసన దీక్షలు

ప్రజాశక్తి-గరివిడి

తమకు సర్వీసు సెటిల్‌మెంట్ వద్దని, ఉపాధి కావాలని డిమాండ్ చేస్తూ దేవాడ మైన్స్ డిఎఫ్ఎన్ సెంటర్‌లో కార్మికులు విజయనగరం జిల్లా మైన్స్ వర్కర్స్‌యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యాన మంగళవారం నిరవధిక నిరాహార దీక్షకు దిగారు. ఈ దీక్షలను సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి టివి రమణ ప్రారంభించారు. అనంతరం కార్మికులనుద్దేశించి ఆయన మాట్లాడుతూ ఆర్‌బిఎస్ఎస్ఎఫ్ఎన్ అండ్ దాస్ కంపెనీ పరిధిలోని దేవాడ మైన్స్ లీజు ఈ ఏడాది జనవరి 23న, సదానందపురం మైన్స్ లీజు సెప్టెంబర్ 14తో పూర్తయ్యిందని, ఈనేపథ్యంలో ఈ మైన్స్ పరిధిలోనూ, వీటి ఆధారంగా గత 10నుంచి 35 సంవత్సరాలుగా పనిచేస్తున్న గరివిడి, గుర్ల, చీపురుపల్లి మండలాలకు చెందిన 503 మంది కార్మికులను విధులనుంచి తొలగించి సర్వీసు సెటిల్ మెంట్ చేస్తామని యాజమాన్యం నోటీసులు జారీ చేసిందని తెలిపారు. ఈ నోటీసులపై న్యూఢిల్లీ సెంట్రల్ లేబర్ కమిషనర్ వారి కార్యాలయంలో ఒకసారి, వర్చువల్‌గా మూడుసార్లు గత నెల రోజులుగా చర్చలు జరిగాయని వివరించారు. ఈ లీజు పూర్తయ్యింది కాబట్టి సెటిల్ మెంట్ చేసేస్తాను అని యాజమాన్యం వాదన వినిపించిందని, మరోవైపు లీజు పూరైన మైన్స్‌కు మళ్లీ టెండర్లలో యాజమాన్యం పాల్గొంటున్నదని తెలిపారపు. ఈ నేపథ్యంలో తమకు సర్వీసు సెటిల్ చేయవలసిన అవసరం లేదని, ఒకవేళ ఈ యాజమాన్యానికి టెండర్లు రాకపోతే అప్పుడు మాత్రమే ఈ విషయం మాట్లాడుతామని అన్నారు. అయినప్పటికీ యాజమాన్యం సర్వీసు సెటిల్ మెంట్ చేయటానికి ప్రయత్నించడాన్ని నిరసిస్తూ మైన్స్ లీజు లను పునరుద్ధరణ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ... కార్మికుల కుటుంబాలను రోడ్డు పైకి నెట్టేయకుండా కార్మికులందరికీ ఉపాధి కొనసాగించాలని కోరుతూ నిరసన దీక్ష చేపట్టినట్లు తెలిపారు. నిరసన దీక్షలో యూనియన్ నాయకులు అంబళ్ల గౌరినాయుడు, విశ్వనాథ రాజు, అప్పలనాయుడు, సన్యాసినాయుడు, రమణ, పాపినాయుడు, సాంబ, వీరభద్రుడు, మైన్స్, ఆక్సైడ్ ప్లాంట్ కార్మికులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న సిఐటియు నాయకులు, మైన్స్ కార్మికులు

సమన్వయంతో పని చేయాలి : కలెక్టర్

ఎస్‌పితో కలిసి ఆలయం, పరిసర ప్రాంతాల పరిశీలన

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్యదైవం పైడితల్లమ్మ అమ్మవారి సిరిమాను జాతర విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ రాంసుందర్ రెడ్డి, జిల్లా ఎస్‌పి ఎ.ఆర్. దామోదర్ సూచించారు. మంగళవారం స్వయంగా సిరిమాను తిరిగే ప్రదేశాలు, భక్తుల రాకపోక మార్గాలు, వాహన పార్కింగ్ ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పైడితల్లమ్మ జాతర ఉత్సవం ఉత్తరాంధ్ర సాంస్కృతిక చిహ్నమని, లక్షలాది మంది భక్తులు వచ్చే నేపథ్యంలో ప్రతి ఒక్కరికీ ఇబ్బందులు లేకుండా చూడడం మనందరి బాధ్యత అని పేర్కొన్నారు. పార్కింగ్, త్రాగునీరు, మరుగుదొడ్లు, విద్యుత్, వైద్యశిబిరాలు వంటి అన్ని సౌకర్యాలు సమగ్రంగా అందుబాటులో ఉండాలన్నారు. జాతర ప్రాంగణంలో శిథిలావస్థలో ఉన్న భవనాలపై ప్రత్యేక దృష్టి సారించి రక్షణ చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. ఎస్‌పి ఎ.ఆర్. దామోదర్ మాట్లాడుతూ సిరిమాను జాతరలో భక్తుల రక్షణ కోసం సమగ్ర బందోబస్తు ఏర్పాటు చేయనున్నామన్నారు. ముందుగా అమ్మవారి క్యూ లైనులను, సిరిమాను తిరిగే అమ్మవారి గుడి నుండి కోట వరకు పరిశీలించారు. ప్రసాదాల పంపిణీ, మీడియా పాయింట్ ఏర్పాట్లు పరిశీలించారు. అనంతరం పూజారి ఇంటి వద్ద చేపట్టనున్న సిరిమాను తయారీ, అక్కడి నుంచి గుడి వరకు సిరిమాను తరలించే విధానం తెలుసుకుని ఆ మార్గమంతా పరిశీలించారు. పరిశీలనలో ఆర్‌డిఓ కీర్తి, ఎసిపి సౌమ్యలత, దేవాదాయశాఖ ఎసి శిరీష, మున్సిపల్ కమిషనర్ నల్లన్నయ్య, తహశీల్దారు కుర్మనాథ్, పూజారి బంటుపల్లి వెంకటరావు, తదితరులు పాల్గొన్నారు.



అమ్మవారి ఆలయ పరిసరాలను పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్‌పి

చెక్ డ్యాముల నిర్మాణానికి చర్యలు తీసుకోండి : బేబినాయన

ప్రజాశక్తి - బొబ్బిలి

నియోజకవర్గంలోని తెర్లాం, బాడంగి, రామభద్రపురం మండలాల్లో రైతులకు సాగునీరు అందించేందుకు చెక్ డ్యాములు నిర్మించాలని ఎమ్మెల్యే బేబినాయన ప్రభుత్వాన్ని కోరారు. అమరావతిలో మంగళవారం జరిగిన అసెంబ్లీ సమావేశంలో ఆయన రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. రామభద్రపురం మండలంలోని కోటశిర్లామ్ దగ్గర ఏడొంపులగెడ్డపై చెక్ డ్యాము నిర్మిస్తే రామభద్రపురం, బాడంగి మండలాల రైతులకు సాగునీరు అందుతుందన్నారు. ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ప్రాజెక్టును పూర్తి చేస్తే రామభద్రపురం, బాడంగి మండలాల రైతులకు సాగునీరు అందుతుందన్నారు. తెర్లాం మండలం లోచర్ల, బొబ్బిలి మండలం శివడవలసలో ఎత్తులోతల పథకం నిర్మాణానికి ఎన్నికల్లో రైతులకు హామీ ఇచ్చామని, నిధులు మంజూరు చేయాలని కోరారు. వర్షాధారంగా సాగు చేస్తున్న రైతులకు సాగునీరు ఇచ్చేందుకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. రైతాంగ సమస్యలపై అసెంబ్లీలో ప్రస్తావించిన ఎమ్మెల్యే బేబినాయనను స్పీకర్ అయ్యన్నపాత్రుడు అభినందించారు.

ప్రాథమిక వైద్యం మాత్రమే చేయాలి

ప్రజాశక్తి-విజయనగరంకోట

ఆర్ఎంపి గ్రామీణ వైద్యులు వైద్య పరమైన జాగ్రత్తలు పాటించి ప్రాథమిక వైద్యం మాత్రమే చేయాలని గ్రామీణ వైద్యుల సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు జంగం జోషి అన్నారు. గ్రామీణ వైద్యుల జోనల్ కార్యవర్గ సమావేశం విజయనగరం స్థానిక పిఎస్ ఆర్ కాంప్లెక్స్ లోని ఆ సంఘం కార్యాలయంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంఘ సభ్యుల సంక్షేమానికి ప్రతి జిల్లాలో బ్యాంక్ అకౌంట్ ప్రారంభించి ఆ నిధిని సభ్యుల సంక్షేమానికి ఖర్చుచేయాలని, ఆర్ఎంపిలకు ప్రభుత్వ గుర్తింపు కోసం రాష్ట్ర నాయకత్వం ఫెడరేషన్ ద్వారా ప్రభుత్వంతో చర్చలు జరుపుతున్నారని తెలిపారు. ఆర్ఎంపి ప్రాథమిక వైద్యం చేస్తున్న ప్రతి ఒక్కరూ సంఘంలో సభ్యత్వం కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో జోనల్ కార్యదర్శి గెద్ద చిరంజీవి, గౌరవాధ్యక్షులు మమ్ముల తిరుపతిరావు, గౌరవ సలహాదారులు కోన ప్రకాష్, ఆరు జిల్లాల అధ్యక్ష కార్యదర్శులు మరియు మహిళా సభ్యులు భవాని ఝాన్సీ చౌదరి శ్రీనివాసరావు కోట్ల పైడ్రాజు సత్యనారాయణ అల్లాడ త్రినాధరావు తదితరులు పాల్గొన్నారు.

పారా మెడలిస్టు నారాయణరావుకు సత్కారం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జిల్లాకు చెందిన అంతర్జాతీయ పారా మెడలిస్ట్ రెడ్డి నారాయణరావు కస్టమ్స్ డిపార్ట్మెంట్ లో ఉద్యోగం సాధించిన సందర్భంగా మంగళవారం రాష్ట్ర కార్యదర్శి వి. రామస్వామి, పారా స్పోర్ట్స్ జిల్లా గౌరవ అధ్యక్షులు దయానంద్ ఇతర అసోసియేషన్ సభ్యులతో కలిసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భం గా దయానంద్ మాట్లాడుతూ వికలాంగుల కుటుంబాల్లో పారా స్పోర్ట్స్ వెలుగులు నింపుతుందని అన్నారు. సంకల్పం ఉంటే ప్రతిభకు వైకల్యం ఏమాత్రం అడ్డు కాదని, కృషి, పట్టుదల, నిరంతర సాధన, ఆత్మ విశ్వాసంతో దేనినైనా సాధించవచ్చని నారాయణరావు నిరూపించాడని అన్నారు. ఎంతోమంది పారా క్రీడాకారులు ప్రభుత్వ ఉద్యోగాలను సాధించారని, అనేకమంది జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించి పతకాలను, ప్రభుత్వం అందించే లక్షలాది రూపాయిల నగదు ప్రోత్సాహన్ని అందుకున్నారని తెలిపారు. కార్యక్రమంలో మన్యం జిల్లా అధ్యక్షులు చీమల రాంబాబు, ఎస్.కోట ప్రతినిధి పి. ప్రతాప్ వర్మ, అంతర్జాతీయ మెడలిస్ట్ శివగంగా, పి. కళ్యాణి తదితరులు పాల్గొన్నారు.

నేరాల నియంత్రణకు అనుగుణంగా పోలీసింగ్ : ఎస్‌పి

ప్రజాశక్తి- కంటోన్మెంట్

సమాజంలో మారుతున్న నేరాలకు అనుగుణంగా పోలీసుల పని తీరు మార్చుకోవాల్సి ఉంటుందని, అందుబాటులో ఉన్న టెక్నాలజీ మరియు ఇతర సాంకేతిక విధానాల పట్ల అవగాహన పెంచుకోవాలని ఎస్‌పి ఎఆర్ దామోదర్ సూచించారు. జిల్లాలోని వివిధ పోలీసు స్టేషనుల్లో పని చేస్తున్న పోలీసు అధికారులతో మంగళవారం నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. దర్యాప్తులో ఉన్న, లాంగ్ పెండింగు కేసులను సమీక్షించారు. ఫిర్యాదుదారుల పట్ల మర్యాదతో వ్యవహరించాలన్నారు. గతంలోని పోలీసింగుకు ప్రస్తుత పోలీసింగులో ఎన్నో మార్పులు వచ్చాయని, కొత్త తరహా నేరాలు సైబరు క్రైం, వైట్ కాలర్ నేరాలు, గంజాయి, మాదక ద్రవ్యాలు, పోక్సో కేసులు వంటి పెరుగుతున్నా యన్నారు. నమోదవుతున్న కేసులకు అనుగుణంగా పోలీసుల పని తీరును మెరుగు పర్చుకోవాలన్నారు. చెడు నడత కలిగిన వ్యక్తులపై నిఘా పెట్టాలని, వారి ప్రవర్తన, నడవడికకు అనుగుణంగా వారిపై కఠిన చర్యలు చేపట్టాలన్నారు. సైబరు నేరాలు, మాదక ద్రవ్యాలు, మహిళల భద్రత, గంజాయి, మాదక ద్రవ్యాల వలన కలిగే అనర్థాలు పట్ల ప్రజల్లో అవగాహన పెంచాలని తెలిపారు. సమావేశంలో ఎఎస్‌పి పి.సౌమ్యలత, ఎఆర్ అదనపు ఎస్‌పి జి.నాగేశ్వరరావు, డిఎస్‌పిలు, సిఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.



గజపతినగరంలో భారీ వర్షం

ప్రజాశక్తి - గజపతినగరం

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా ఒక్కసారిగా వాతావరణంలో మార్పులు చోటు చేసుకుని భారీ వర్షం కురిసింది. మంగళవారం గజపతినగరం మండల వ్యాప్తంగా అల్పపీడనం ప్రభావంతో కుండపోతగా భారీ వర్షం కురిసింది. దీంతో పట్టణంలో మెంటాడ రోడ్డు, సంత తోట పలు ప్రాంతాలకు వెళ్లే రోడ్లు పూర్తిగా జలమయమయ్యాయి. అటు గ్రామాల్లో భారీ వర్షానికి ముంపు ప్రాంతాలలో ఉండే వరిపంట పూర్తిగా చెరువులు తలపిస్తున్నాయి. ఈ సందర్భంగా ఎఒ కిరణ్ కుమార్ మాట్లాడుతూ రైతులు తప్పనిసరిగా వరి పంటపై నీటి ప్రవాహం ఉన్నచోట, పంట ముంపునకు గురైన ప్రాంతాల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని సూచించారు. రైతు సేవా కేంద్రాల వద్ద ఉన్న తమ సిబ్బందిని సంప్రదించి వరి పంటపై ఏవైనా సందేహాలుంటే వారి ద్వారా సలహాలు సూచనలు తీసుకోవాలని కోరారు.

వెంకటేష్‌కు పిహెచ్‌డి పట్టా

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

కొత్తపల్లి వెంకటేష్ అనే రీసెర్చ్ స్కాలర్.. ప్రొఫెసర్ జి.స్వామినాయుడు పర్యవేక్షణలో చేసిన పరిశోధన మేరకు పిహెచ్‌డి పట్టా పొందారు. ఆయన చేసిన పరిశోధన వైమానిక, నౌకాదళ రంగంలో అధిక సామర్థ్యం కలిగిన మెటీరియల్స్ గా ఉపయోగించడానికి ఎంతగానో దోహదపడుతుంది. ఈ పరిశోధనలో డెవలప్ చేసిన మెటీరియల్ అధిక బలం, తుప్పు నిరోధకత, ఘర్షణ నిరోధకత కలిగి ఉండటం వలన రక్షణ రంగంలో ఎంతగానో ఉపయోగపడుతుంది. వెంకటేష్ జె ఎన్ టి యు గురజాడ విజయనగరం నుండి పిహెచ్‌డి పొందిన మొట్టమొదటి ఫుల్ టైం రీసెర్చ్ స్కాలర్ అని యూనివర్సిటీ రీసెర్చ్ అండ్ డెవలప్మెంట్ డైరెక్టర్ ప్రొఫెసర్ జి. స్వామినాయుడు తెలియజేశారు. ఈసందర్భంగా వెంకటేష్‌కు నిట్ నాగపూర్, మెటలర్జికల్ ఇంజనీరింగ్ విభాగాధిపతి ప్రొఫెసర్ డి. రవికుమార్అభినందనలు తెలిపారు.



రాష్ట్రస్థాయి పోటీలకు గురజాడ విద్యార్థి ఎంపిక

ప్రజాశక్తి -విజయనగరం టౌన్

విజయనగరం విజ్జీ స్టేడియంలో జరిగిన స్కూల్ గేమ్స్‌లో గురజాడ పాఠశాలకు చెందిన ఏడో తరగతి విద్యార్థిని పి.మేఘన తైక్వాండో జిల్లా స్థాయి పోటీల్లో ప్రథమ బహుమతి పొంది గోల్డు మెడల్ సాధించింది. రాష్ట్రస్థాయి పోటీకి ఎంపికైన మేఘనను స్కూల్ డైరెక్టర్ డాక్టర్. ఎం.వి.ఆర్.కృష్ణాజి స్కూల్ ప్రధానోపాధ్యాయులు పి.శేఖర్ , వ్యాయామ ఉపాధ్యాయులు పి. సన్యాసినాయుడు అభినందించారు.



విద్యార్థిని అభినందిస్తున్న గురజాడ స్కూలు డైరెక్టర్ కృష్ణాజి, హెచ్ఎం శేఖర్

11 ఏళ్లుగా నిర్మాణంలోనే..

నిత్యం కోతకు గురవుతున్న మారిక రోడ్డు

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని కరకవలస పంచాయతీ పరిధిలోని మారిక గిరిజన గ్రామానికి వేస్తున్న రోడ్డు నిర్మాణ పనులు ఈ తరానికి పూర్తి అవుతాయో లేదో అనుమానం కలుగుతుంది. నేటికీ సుమారు 11ఏళ్లగా రోడ్డు పనులు జరుగుతూనే ఉన్నాయి. అయినప్పటికీ పనులు మాత్రం పూర్తి కాలేదు. ఈ రెండు మూడు రోజుల్లో పడిన వర్షానికి వేసిన రోడ్డు కోతకు గురై రాకపోకలకు ఇబ్బందిగా తయారైంది. ప్రధానంగా సంబంధిత అధికారులు పర్యవేక్షణ లోపం వల్లనే ఈ రోడ్డు పనులు నత్త నడకన సాగుతున్నాయి. నాణ్యత లోపం వల్లనే వేసిన రోడ్డు వర్షానికి ఎక్కడికక్కడ కోతకు గురై ప్రజాధనం వృథా అవుతుంది. దీంతో గిరిజనులకు మాత్రం రోడ్డు సౌకర్యం కల్పించే పరిస్థితి కనిపించడం లేదు. ఇప్పటికైనా ప్రభుత్వం, సంబంధిత అధికారులు గిరిజనులపై ఏమాత్రం అభిమానం ఉన్నా అసంపూర్తిగా ఉన్న రోడ్డు పనులను పూర్తిగా నాణ్యతతో జరిగే విధంగా తగు చర్యలు తీసుకోవాలని గిరిజన గ్రామానికి చెందిన మహిళలు, గిరిజన యువకులు కోరుతున్నారు.



కోతకు గురైన మారిక రహదారి

ధరలు తగ్గించి మందులు విక్రయించాలి

డ్రగ్స్ నియంత్రణ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ రజిత

ప్రజాశక్తి -కంటోన్మెంట్

జిల్లాలో ఉన్న మందుల షాపుల యజమానులను కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నూతన జిఎస్‌టి ప్రకారం తగ్గింపు ధరలను అమలు చేయాలని జిల్లా డ్రగ్స్ నియంత్రణ అసిస్టెంట్ డైరెక్టర్ కె.రజిత తెలిపారు. మంగళవారం తన ఛాంబర్ లో జిల్లాలోని మందుల షాపుల యజమానులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన జిఎస్‌టి తగ్గింపును మందుల దుకాణాల్లో అమలు చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వం మందులపై జిఎస్‌టి 12 శాతం నుంచి 5 శాతానికి తగ్గించిందని తెలిపారపు. రాష్ట్ర డ్రగ్ నియంత్రణ అధికారుల ఆదేశాల మేరకు ఈ సమావేశం నిర్వహించా మన్నారు. సమావేశంలో జిల్లాలోని మందుల షాపుల యజమానులు పాల్గొన్నారు



ఆకట్టుకున్న ఆర్ట్ గ్యాలరీ

ప్రజాశక్తి-విజయనగరం కోట

వికసిత భారత్ 2047 సందర్భంగా ప్రారంభమైన సేవా పర్వ్ చిత్ర కళా సమ్మేళనం ఈనెల 17 నుండి మహారాజ ప్రభుత్వ సంగీత నృత్య కళాశాల విజయనగరంలో జరుగుతోంది. కార్యక్రమాలలో చివరి రోజు మంగళవారం వికసిత భారత్ పై ఆర్ట్ గ్యాలరీ , విజయనగరం ప్రముఖ చిత్రకారుల చిత్ర ప్రదర్శన కళాశాల కచేరి మందిరంలో జరిగింది. కార్యక్రమంలో కళాశాల విద్యార్థులు, ఇతర ప్రైవేట్ స్కూల్ విద్యార్థులు పాల్గొన్నారు. ముఖ్య అతిథులుగా సంగీత కళాశాల విశ్రాంత అధ్యక్షులు ద్వారం దుర్గాప్రసాద రావు, విశ్రాంత ఉపన్యాసకులు గోపాలరావు, కాపుగంటి ప్రకాష్, లక్ష్మిరామదాసు, వినాయకమ్మ, విజయ కుమార్, కళాశాల పూర్వ విద్యార్థుల సంఘం కార్యదర్శి బూరాడ శ్రీనివాస రావు హాజరయ్యారు. ప్రదర్శనలో వుంచిన చిత్ర పటాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులకు బహుమతి ప్రదానం చేశారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ మండపాక నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



సంగీత కళాశాలలో ఏర్పాటు చేసిన ఆర్ట్స్ గ్యాలరీ

ఓపెన్ స్కూల్‌లో ప్రవేశాలకు గడువు పెంపు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

2025-26 విద్యాసంవత్సరానికి (ఎపి ఓపెన్ స్కూల్స్) పదోతరగతి, ఇంటర్మీడియట్ కోర్సులలో దరఖాస్తు చేసుకునేందుకు రూ.200 అపరాధ రుసుముతో అక్టోబర్ 15వరకు గడువు పొడిగించినట్లు డిఇఒ మాణిక్యం నాయుడు తెలిపారు. www.apopenschool.ap.gov.in వెబ్‌సైట్‌లో వివరాలు నమోదు చేసుకొని మీకు దగ్గరలో గల ఓపెన్ స్కూల్ సెంటరుకు వెళ్లి ఒరిజినల్ సర్టిఫికేట్ లు సమర్పించి తరువాత ఫీజు చెల్లించి ప్రవేశం పొందాలని తెలిపారు. టెన్త్ ప్రవేశం పొందే విద్యార్థులు 31-08-2025 నాటికి 14 ఏళ్లు వయసు కలిగి ఉండాలన్నారు. రికార్డుషీట్ లేదా టీసీతో పాటు అభ్యర్థి ఆధార్ కార్డు, తండ్రి/ తల్లి ఆధార్ కార్డు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలు కులధ్రువీకరణ పత్రాలు పొందుపరచాలని తెలిపారు. వికలాంగ విద్యార్థులు వైద్య ధ్రువీకరణ పత్రం ఇవ్వాలని, ఎటువంటి విద్యార్హత లేకున్నా జనన ధ్రువీకరణపత్రంతో పాటు స్వీయ ధ్రువీకరణతో నేరుగా పదోతరగతిలో అడ్మిషన్ పొందవచ్చునని తెలిపారు. ఇంటర్ ప్రవేశం పొందాల్సిన విద్యార్థులు పదోతరగతి ఉత్తీర్ణత సాధించి ఉండాలని, అడ్మిషన్లకు పదవ తరగతి పాస్ సర్టిఫికేట్ తో పాటు అభ్యర్థి ఆధార్‌కార్డు, తండ్రి/ తల్లి ఆధార్ కార్డు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలు కులధ్రువీకరణ పత్రాలు పొందుపరచాలని తెలిపారు.

ఎంఆర్ ఫార్మసీ కళాశాలలో ఆయుర్వేద డే

ప్రజాశక్తి-విజయనగరం

మహారాజా కాలేజ్ ఆఫ్ ఫార్మసీలో మంగళవారం నేషనల్ ఆయుర్వేద డేను పురస్కరించుకుని ఆయుర్వేద్ ఫర్ పీపుల్ అండ్ ప్లానెట్ అనే థీమ్‌తో ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. మార్కెట్లో లభించే ఔషధ నమూనాల్లో కల్తీ పదార్థాల గుర్తింపు పై ప్రదర్శన చేసి, వివిధ కల్తీ పదార్థాలను గుర్తించే విధానాన్ని విద్యార్థులకు చూపించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. రామయ్య మాట్లాడుతూ ఆయుర్వేద జ్ఞానానికి శాస్త్రీయ ఆధారాలను కల్పించడం ద్వారా అది మరింత విశ్వసనీయంగా మారుతుందని తెలిపారు. దుష్ప్రభావాలు లేని ఆయుర్వేద ఔషధ గుణాలు కలిగిన మొక్కల ఆరోగ్యానికి అత్యంత ఉపయోగకర మని తెలిపారు



ఫార్మా ప్రదర్శనను తిలకిస్తున్న విద్యార్థినిలు

మహారాజా కాలేజీ ఆఫ్ ఫార్మసీలో ఫార్మా స్పార్క్

మహారాజా కాలేజ్ ఆఫ్ ఫార్మసీలోని ఫార్మసిటికల్ అనాలసిస్ అండ్ కెమిస్ట్రీ విభాగం ఆధ్వర్యంలో ఫార్మా స్పార్క్ కార్యక్రమం నిర్వహించారు. ఈ ప్రదర్శనలో మందుల తయారీ ప్రక్రియలు, విశ్లేషణ పద్ధతులు, వాటి ప్రభావాలు, ప్రయోజనాలు, జాగ్రత్తలు నమూనాల రూపంలో ఆకర్షణీయంగా ప్రదర్శించారు. కార్యక్రమంలో వివిధ ప్రభుత్వ, ప్రైవేట్ ఇంటర్మీడియట్ కళాశాలల నుండి 300మంది విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు. అదనంగా, ఆ కళాశాల నుండి 400 మంది విద్యార్థులు సందర్శించగా, మొత్తం 700మందికి పైగా ఈ ప్రదర్శన ద్వారా ప్రయోజనం పొందారని ప్రిన్సిపాల్ రామయ్య తెలిపారు.

నేడు హిందీ పక్షోత్సవం సందర్భంగా పోటీలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జాతీయ హిందీ పక్షోత్సవం సందర్భంగా హిందీ మంచ్ ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థులకు బుధవారం హిందీ పోటీలను నిర్వహిస్తున్నట్లు జిల్లాశాఖ అధ్యక్షురాలు పి.ఉమాబాల, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఏలూరి శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం జరగనున్న హిందీ ఉత్సవ సభలో విజేతలకు బహుమతులను అందజేయనున్నట్లు ఆమె తెలిపారు. వివరాలకు 98851 08688, 77807 93802 నెంబర్లను సంప్రదించాలని తెలిపారు.

ప్రజాశక్తి
www.prajasakti.com

కౌలు రైతుకు యూరియా కష్టాలు

ప్రజాశక్తి - జామి రూరల్

కౌలు రైతుల ఎరువుల కష్టాలు వర్ణనాతీతం. జిల్లాలో ఎరువుల కొరత తీవ్రమైన తరుణంలో కౌలు రైతులు యూరియా కోసం పడరాని పాట్లు పడుతున్నారు. బస్తా యూరియా కోసం ఎక్కడికి వెళ్లాలో.. ఎవరిని అడగాలో అర్థం కాక నానా అవస్థలు పడుతున్నారు. అధికారులు మాత్రం ఈ - క్రాప్ చేసుకున్న రైతుకు ఎకరాకు బస్తా ఎరువు మాత్రమే ఇస్తున్న పరిస్థితి. ఈ నేపథ్యంలో కౌలు రైతుల ఎరువు కష్టాలు గ్రామాల్లో ఆందోళన కలిగిస్తున్నాయి. జామి మేజరు పంచాయతీ అప్పన్నపాలెం గ్రామంలో రొంగలి వెంకటరావుకు సెంటు భూమి కూడా లేదు. కానీ ఆ కుటుంబం 7 ఎకరాలు కౌలుకు సాగు చేస్తుంది. అందులో ఒకటిన్నర భూ యజమానులు ఈ - క్రాప్ చేసుకునే అవకాశం ఇవ్వడంతో వారికి మూడు బస్తాల వరకు ఎరువు దొరుకుతోంది. మిగిలిన నాలుగు ఎకరాల పంటకు యూరియా అందని పరిస్థితి. ఒక్క వెంకటరావు కుటుంబమే కాదు. ఈ గ్రామంలో 40 కుటుంబాలకు 20 కుటుంబాలు కౌలు వ్యవసాయం చేసుకుని బతికిన వారే. దీన్ని బట్టి మండలంలో, జిల్లాలో కౌలు రైతుల ఎరువు కష్టాలు ఎంత తీవ్రమైనవో అర్థం చేసుకోవచ్చు.

మండలంలో ఈ ఖరీఫ్ కు 900 మెట్రిక్ టన్నుల యూరియా అవసరమని అధికారులు నివేదికలు ఉన్నప్పటికీ,




ఎరువుల కోసం ఎదురు చూస్తున్న కౌలు రైతులు

ఇప్పటికి కేవలం 700 మెట్రిక్ టన్నులు పంపిణీ చేసినట్టు అధికారులు చెబుతున్నారు. ఈ లెక్కన ఇంకా 200 మెట్రిక్ టన్నుల కొరత ఉంది. ఇప్పటి వరకు జరిగిన పంపిణీలో అధికార పార్టీ, పలుకుబడి ఉన్నవారి జోక్యంతో సాధారణ రైతుకు ఎరువు అందడం గగనమవుతోంది. మొత్తానికి సామాన్య రైతు మొదలుకొని, కౌలు రైతు వరకు ఎరువులు కోసం పడిగాపులు కాస్తున్న పరిస్థితి. వ్యవసాయ అధికారులను ప్రజాశక్తి వివరణ అడుగగా, ఈ - క్రాప్ అయినా జాబితా ప్రకారమే ఎరువులు పంపిణీ చేస్తున్నామని చెబుతున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు కౌలు రైతులకు ఎరువులు అందించే విదంగా చర్యలు చేపట్టాలను రైతు సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

ఆర్‌ఎస్‌కెలో యూరియా పంపిణీ

జామి మండలంలోని వెన్నె, జామి రైతు సేవా కేంద్రాల్లో మంగళవారం యూరియా పంపిణీ చేశారు. రైతులకు క్యూ పద్ధతిలో ఆకెపైని చేసి స్లిప్‌లు ఇచ్చారు. వెన్నెలో ఇన్‌ఛార్జ్ ఎంపిడిఒ వి. నరసింహం, ఎంపిటిసి రాయవరపు సత్యం, పంచాయతీ కార్యదర్శి ఎస్.రమణరావు, జామి వ్యవసాయ, సచివాలయ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

డెంకాడ: మండల కేంద్రంలోని రైతు సేవా కేంద్రం, సాయి కృష్ణ రైతు మిత్ర గ్రూప్ ఎరువుల షాపుల వద్ద మంగళవారం ఎఒ టి.సంగీత, తహశీల్దార్ రాజారావు, ఎస్‌ఐ సన్యాసినాయుడు ఆధ్వర్యంలో రైతులకు యూరియా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ అధికారిని సంగీత మాట్లాడుతూ రైతులకు కావలసిన యూరియా విడతల వారీగా తీసుకువచ్చి పంపిణీ చేస్తున్నామన్నారు. సోమవారం మండలానికి 48 మెట్రిక్ టన్నుల యూరియా వచ్చిందని, ఈ యూరియాను మంగళవారం మండలంలోని పెదతాడివాడ, పినతాడివాడ, సింగవరం, నాతవలస, నగరం పేట, మహంతిపేట, గుండాలపేట, రఘుమండ గ్రామాల రైతులకు పంపిణీ చేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఎఇఒ రామకోటి, విఎఎలు లెనిన్, రాంబాబు, అపర్ణ తదితరులు పాల్గొన్నారు.



మాస్టారును సత్కరిస్తున్న నాయకులు

చంద్రరావు మాస్టారుకు సన్మానం

ప్రజాశక్తి - గజపతినగరం

మండలంలోని తమ్మూరాయుడుపేట ప్రాథమిక పాఠశాలలో మంగళవారం సరస్వతీ దేవి విగ్రహం ప్రతిష్ట కార్యక్రమంలో భాగంగా గతంలో ఆ పాఠశాలలో పనిచేసిన ఉపాధ్యాయులు కనకల చంద్రరావుకి ఘన సత్కారం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిపి గంట్యాడ శ్రీదేవి, తలారి రామచంద్రుడు, దన్నాన రామునాయుడు పాఠశాల ప్రధానోపాధ్యాయులు భాస్కర్‌రావు పాల్గొని చంద్రరావు మాస్టారు సేవలను కొనియాడారు. గ్రామ యువత కూడా ఆయన్ను ఘనంగా సన్మానించారు.

పశువైద్య కళాశాలలో నేత్ర వైద్య శిబిరం

ప్రజాశక్తి - గరివిడి

పట్టణ పశువైద్య కళాశాలలో అసోసియేట్ డీన్ డాక్టర్ మక్కెన శ్రీను అధ్యక్షతన స్వచ్ఛంద సంస్థ ఒజయ లయన్స్ ఐ హాస్పిటల్ సహకారంతో మంగళవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. కంటి ఆరోగ్యం, శ్రేయస్సును మెరుగుపరచడంపై దృష్టి సారించి, సిబ్బంది, విద్యార్థులకు ప్రయోజనం చేకూర్చడానికి ఈ శిబిరం నిర్వహిస్తున్నామని డీన్ అన్నారు. ప్రముఖ కంటి వైద్య నిపుణులు డాక్టర్ సునీల్ కుమార్ తంగరాజు ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. శిబిరంలో విద్యార్థులు, అధ్యాపక సిబ్బంది ఉచిత కంటి పరీక్షలు చేయించుకున్నారు. అనంతరం కంటి ఆరోగ్యానికి సంబంధించిన విషయాలపై వైద్యులు అవగాహన కల్పించారు. ఎన్‌ఎస్‌ఎస్ అధికారులు డాక్టర్ సిహెచ్ జ్యోతిశ్రీ, డాక్టర్ ఎస్ గంగునాయుడు, డాక్టర్ వై స్వాతి, డాక్టర్ మనోజ్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఇ- పంట నమోదు తప్పనిసరి

ప్రజాశక్తి - రామభద్రపురం

రైతులు పండించిన ప్రతీ పంటను ఈ పంట వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలని ఎడి మధుసూదనరావు సూచించారు. మంగళవారం కొట్టక్కిలో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అధిక ఎరువులు వాడకం వల్ల భూ ఆరోగ్యం, పంటల నాణ్యత దెబ్బతింటుందని తెలిపారు. ఎఒ శివ మాట్లాడుతూ ఈ పంటలో పంటలు నమోదు చేసుకోవడం వల్ల పంటల బీమా, మద్దతు ధర, వడ్డీ లేని రుణాలు వంటి పథకాలు వస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సేవా కేంద్ర సిబ్బంది సౌజన్య, రైతులు పాల్గొన్నారు.

తప్పిన పెను ప్రమాదం

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని కొండగంగుపూడి పంచాయతీ పరిధిలోగల గిరిజన బాలుర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఉన్న భారీ చెట్టు గత కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షానికి మంగళవారం నేలకూలింది. పాఠశాలకు దసరా సెలవులు కావడంతో విద్యార్థులు పాఠశాలలో లేకపోవడంతో పెనుప్రమాదం తప్పింది. పక్కనే ఉన్న నిత్యవసర సరుకులు దుకాణానికి ఆ సమయంలో ఎవరూ రాకపోవడంతో ఎటువంటి ప్రమాదం జరగలేదని స్థానికులు ఊపిరిపీల్చుకున్నారు.

నేడు సింగరాయిలో ఉచిత మెగా వైద్య శిబిరం

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని సింగరాయి గ్రామంలో బుధవారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు వెల్నెస్ సెంటర్ సిహెచ్ఒ పార్థసారథి తెలిపారు. ఈ వైద్య శిబిరంలో ప్రధానంగా కంటి పరీక్షలు నిర్వహిస్తామన్నారు. కేన్సర్ స్క్రీనింగ్ కోసం ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేస్తామన్నారు. వైద్య పరీక్షలు కోసం వచ్చేవారంతా ఆధార్ కార్డు తప్పనిసరిగా తీసుకురావాలన్నారు. సింగరాయి సచివాలయ పరిధిలో జగ్గయ్యపేట, అరిగిపాలెం గ్రామపంచాయతీ ప్రజలు కూడా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఓటర్ల జాబితా సవరణపై వర్క్‌షాప్

ప్రజాశక్తి - నెల్లిమర్ల

2002 నుంచి 2025 వరకు ఓటర్ల జాబితాపై ఆయా పోలింగ్ కేంద్రాల్లో బిఎల్‌ఒలు సవరణ వర్క్‌షాప్ నిర్వహించారు. మంగళవారం నెల్లిమర్ల అర్బన్ పోలింగ్ కేంద్రం 21 నుంచి 25, సారిపల్లి 66, 67, 68, 69, టెక్కలి, చంద్రంపేట, కొండవెలగాడ 1, 2, 3, 5, సతివాడ 54, 55, 56, జరజాపుపేట 16 నుంచి 20 పోలింగ్ కేంద్రాల వరకూ ఓటర్ల జాబితా తహశీల్దార్ కె.శ్రీకాంత్ ఆదేశాల మేరకు తనిఖీ చేసి సవరణలు చేస్తునట్లు ఎలక్షన్ డిటి వివిఆర్ జగన్నాధరావు తెలిపారు. వర్క్‌షాప్‌లో ఆయా పోలింగ్ కేంద్రాల బిఎల్‌ఒలు పాల్గొన్నారు.

బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేస్తే చర్యలు

ప్రజాశక్తి - బొబ్బిలి

బహిరంగ ప్రదేశాలలో చెత్త వేస్తే చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ ఎల్.రామలక్ష్మి ఆదేశించారు. పట్టణంలోని రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జి, కోటి చెరువు గట్టు ప్రాంతాల్లో మంగళవారం పారిశుధ్య పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కోటి చెరువు గట్టు కింద, చెరువు గర్భంలో చెత్త వేయకుండా చూడాలన్నారు. బహిరంగ ప్రదేశాలలో చెత్త వేస్తే జరిమానా విధించాలన్నారు. కోటి చెరువు గట్టుపై మొక్కలను పరిశీలించి మొక్కల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలన్నారు. కాలువలలో చెత్త వేయకుండా చూడాలన్నారు. ఆమెతో శానిటరీ ఇన్‌స్పెక్టర్ మురళీ, శానిటేషన్ సిబ్బంది ఉన్నారు.

బంగారు కుటుంబాల అనుసంధానంపై శిక్షణ

ప్రజాశక్తి - గంట్యాడ

మండలంలోని ఎంపికైన బంగారు కుటుంబాలను అనుసంధానం చేయడానికి మంగళవారం మండల కార్యాలయంలో శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంఛార్జి ఎంపిడిఒ ఎం.రాములమ్మ ఆధ్వర్యంలో నియోజకవర్గం స్పెషల్ ఆఫీసర్ ప్రమీల గాంధీ పర్యవేక్షణలో యంగ్ ప్రొఫెషనల్ సురేంద్ర విజన్ సిబ్బంది శిక్షణ అందించారు. బంగారు కుటుంబాలుగా గుర్తించిన వారికి మార్గ దర్శకులుగా ఏ విధంగా అనుసంధానం చేయాలని దానిపై పునాది స్థాయిలో సమన్వయాన్ని బలోపేతం చేయడం, వ్యూహాలను అవలంబించడం, ఫీల్డ్ స్థాయిలో మెరుగైన ఫలితాలు సాధించడం పైన శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు ఎంఎటిఎస్, విఆర్‌ఒలు, టిఒటిఎస్, విఆర్‌ఎలు, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు, వ్యవసాయ సహాయకులు 22 సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.


వాహన రాకపోకలు మళ్లింపు

ప్రజాశక్తి- గంట్యాడ

మండలంలోని కొండతామరపల్లి నుంచి విజయనగరం హుకుంపేటకు బుధవారం పైడితల్లమ్మ సిరిమానును తరలించనున్న నేపథ్యంలో వాహనాలు రాకపోకలను మళ్ళిస్తున్నామని స్థానిక ఎస్ఐ సాయికృష్ణ తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కొండతామరపల్లి జంక్షన్ నుండి పెద్దమజ్జిపాలెం మీదుగా దేవుపల్లి వైపు వెళ్లే వాహనాలను గింజేరు జంక్షన్ నుంచి పెద్దమజ్జిపాలెం ప్రభుత్వ ఆరోగ్య కేంద్రం పక్క నుంచి దేవుపల్లి వెళ్లడానికి, దేవుపల్లి నుంచి విజయనగరం ఎస్.కోట తాడిపూడి మీదగా బొడ్డవర వెళ్లడానికి వచ్చిన వాహనాలు పెద్దమజ్జిపాలెం ప్రభుత్వ ఆసుపత్రి పక్క నుంచి గింజేరు మీదుగా ఎస్ కోట విజయనగరం వెళ్లే ఎన్‌హెచ్ 16 పైకి మళ్లిస్తామన్నారు.

గుంతలను పూడ్చిన యువత, పోలీసులు

ప్రజాశక్తి - నెల్లిమర్ల



గోతులను పూడ్చుతున్న యువత, పోలీసులు

నెల్లిమర్ల నుంచి రామతీర్థం వెళ్లే రహదారిలో ఏర్పడ్డ గుంతలను యువత, పోలీసులు మంగళవారం పూడ్చారు. ముఖ్యంగా గొర్లిపేట బ్రిడ్జి దగ్గర గత కొద్ది రోజుల నుంచి రోడ్డు వర్షానికి బాగా గుంతలు పడి ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో భోగాపురం రూరల్ సిఐ జి. రామకృష్ణ, స్థానిక యువకుల సహాయంతో నెల్లిమర్ల ఎస్ఐ బి.గణేష్‌తో కలిసి గుంతలను ప్రయాణికుల సౌకర్యార్థం పూడ్చివేశారు. ఈ సందర్భంగా గుంతలు పూడ్చడానికి సహకరించిన యువకులను సిఐ అభినందించారు.



పొలాలపైకి పారుతున్న వరద నీరు

పాతబట్టి కాలువకు గండి

నీట మునిగిన పంట పొలాలు

ప్రజాశక్తి- మెంటాడ

మండలంలోని ఆంధ్ర రిజర్వాయర్ అనుబంధంగా ఉండే పాతబట్టి కాలువకు మంగళవారం గండిపడి పడింది. దీంతో దిగువనున్న పంటపొలాలు నీటమునిగాయి. మండలంలో మధ్యాహ్నం నుంచి ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలకు నీటి ప్రవాహ ఒత్తిడికి కాలువకు గండిపడిన నేపథ్యంలో రైతులు ఆందోళన చెందుతున్నారు. వరిపొలాలు నీటమునగడంతో నష్టపోతున్నామని వాపోయారు. కాగా జగన్నాధపురం వద్ద కల్వర్టు పై నుంచి చంపావతి నదినీరు ప్రవహించడం వల్ల రాకపోకలు నిలిచిపోయి ప్రజలు ఇబ్బంది పడుతున్నారు.

నేటి నుంచి ఆర్‌ఎస్‌కె వద్ద ధర్నా



నిరసన తెలుపుతున్న నిర్వాసితులు

ప్రజాశక్తి- శృంగవరపుకోట

మండలం లోని మూల బొడ్డవర రైతు సేవా కేంద్రం వద్ద జిందాల్ భూ నిర్వాసితులు బుధవారం నుంచి నిరసన తెలిపేందుకు పోలీసులు పోలీసులు అనుమతి ఇచ్చారని జిందాల్ భూ నిర్వాసితులు మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా వారు బొడ్డవరలో నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ జిందాల్ సంస్థ తమ భూములను తీసుకుని ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా మోసం చేసిందని నేటికి 95 రోజులుగా నిరసన చేపడుతున్నామని చెప్పారు. నిరసన చేయడానికి అనుమతి కోరుతూ పలుమార్లు దరఖాస్తులు సమర్పించామని పోలీసులు తిరస్కరించడంతో న్యాయ స్థానాన్ని ఆశ్రయించామని చెప్పారు. ఇప్పుడు న్యాయ స్థానం ఆదేశాలతో తమకు నిరసన తెలుపుకునేందుకు పోలీసులు ఎట్టకేలకు అనుమతులిచ్చారన్నారు. అది కూడా తమ గొంతులు ఎవరికీ వినపడకూడదని మోసపూరిత ఆలోచనతో, ప్రధాన రహదారికి, జనావాసానికి దూరంగా ఉన్న మూలబొడ్డవర రైతు సేవా కేంద్రం వద్ద నిరసన చేసుకోవడానికి అనుమతి ఇచ్చారని తెలిపారు. తమ నిరసనను అణచివేయాలని, తమ ఆవేదనను ఈ ప్రపంచానికి తెలియకుండా చేయాలని చేస్తున్న కుట్ర అని అన్నారు. బుధవారం నుండి ప్రతిరోజు ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 4గంటల వరకు నిరసన తెలియజేస్తామని నిర్వాసితులు వెల్లడించారు.

పోలీస్ నిర్బంధాలతో ఉద్యమాలు ఆగిపోవు : సిపిఎం

పోలీసుల నిర్బంధాలతో ఉద్యమాలు ఆగిపోవని సిపిఎం నాయకులు చల్లా జగన్ అన్నారు. ఈ సందర్భంగా మంగళవారం బొడ్డవర వద్ద జిందాల్ బాధితులతో కలసి ఆయన విలేకరులతో మాట్లాడుతూ జిందాల్ బాధితులను ఆదుకోవలసిన అధికారులు, ప్రభుత్వం జిందాల్ యాజమాన్యం చెప్పిన విధంగా వారికి అనుకూల నిర్ణయాలే అమలు చేయడం సిగ్గుచేటన్నారు. సిపిఎం పార్టీ, రైతు సంఘం విధానమే పేద రైతులు, పేదల తరపున పోరాటం, అభాగ్యులకు న్యాయం చేయడం అన్నారు. జిందాల్ మోసాలకు సర్వం కోల్పోయిన నిర్వాసితులకు అండగా ఉండి వారికి మద్దతుగా నిలవడం ఏ చట్టం కింద తప్పవుతుందో చెప్పాలన్నారు. 95 రోజుల పోరాటంలో ఎక్కడా అశాంతి కలిగించలేదన్నారు. సమస్య పరిష్కారం చేయకుండా ఉద్యమాన్ని పోరాటాన్ని పోలీసులు చేతుల్లోకి తీసుకొని అణచివేయాలనుకోవడం అవివేకం అన్నారు. సమస్య ఉన్నప్పుడు ఉద్యమాలు తిరుగుబాటు ఉంటుందన్నారు. ముందుగా ఆ సమస్యకు పరిష్కారం వెతకాలి తప్ప నాయకులను నిర్బంధించడం, కేసులు పెట్టి నిర్వాసితులకు వ్యతిరేకంగా, జిందాల్ యాజమాన్యానికి అనుకూల చర్యలు తప్పు అన్నారు. అంతిమ విజయం నిర్వాసితులదేనని అన్నారు. ప్రతిరోజు ఇళ్లకు పోలీసులు పంపించడం, మార్గమధ్యంలో అడ్డుకొని స్టేషన్‌కి రావాలని పిలవడం, స్టేషన్‌లో రోజంతా నిర్బంధించడం, పోలీసులు కొత్త సాంప్రదాయానికి తెరలేపారన్నారు.



కాలువలోకి దిగిపోయిన ట్రాక్టర్

తవ్వేశారు.. వదిలేశారు..

ఇంటింటి కుళాయి గోతులతో ఇబ్బందులు

ప్రజాశక్తి- శృంగవరపుకోట

జల జీవన్ మిషన్ ద్వారా పట్టణంలోని శ్రీనివాస కాలనీలో ఏర్పాటు చేసిన ఇంటింటి కుళాయిల కోసం తవ్విన గోతులను కాంక్రీట్‌తో పూడ్చకపోవడం వల్ల కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. కాలనీ స్థలాలు ప్రభుత్వం పేదలకు ఇచ్చేటప్పుడు లే అవుట్ వేయకపోవడం వల్ల రహదారులకు సంబంధించిన స్థలాలను కూడా ఆక్రమించడంతో రోడ్డు ఇరుతట్టుగా మారింది. దీనికి తోడు ఇరువైపులా ఇంటింటి కుళాయి పైపులైన్లు కోసం గోతులు తవ్వేశారు. దీంతో రోడ్లు మరింత చిన్నవిగా అయ్యి వాహనాలు తప్పించుకునేందుకు వీలుకాకుండా మారిపోయింది. ఇటీవల కురుస్తున్న వర్షాలకు తవ్విన గోతులలో ట్రాక్టర్లు దిగబడిపోవటం, అధిక లోడ్లతో ట్రాక్టర్లు రావటం వల్ల సైడ్ కాలువల అంచులు విరిగిపోవడం తరచూ జరుగుతున్నాయి. ఇకనైనా ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు స్పందించి కాంట్రాక్టర్ చేత వెంటనే తవ్విన గోతులను కాంక్రీట్‌తో పూడ్చే విధంగా చర్యలు తీసుకోవాలని కాలనీ ప్రజలు కోరుతున్నారు.

సిరిమాను చెట్టును దర్శించుకున్న చైర్మన్

ప్రజాశక్తి- గంట్యాడ

మండలంలోని కొండతామరపల్లి గ్రామంలో వెలసిన పైడితల్లమ్మ సిరిమాను చెట్టును జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య మంగళవారం దర్శించుకున్నారు. సిరిమాను చెట్టు ఉన్న పరిసర ప్రాంతాలను పరిశీలించి, బుధవారం సిరిమానును విజయనగరం తరలించడానికి అన్ని ఏర్పాట్లు సక్రమంగా చేయాలని స్థానిక నాయకులతో చర్చించారు. సిరిమానును దర్శించుకోవడానికి వచ్చిన భక్తులకు ఇటువంటి ఇబ్బందులూ లేకుండా వన భోజనాలను సక్రమంగా అందించాలని గ్రామ నాయకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి వర్రి నరసింహమూర్తి, ఎస్‌సి సెల్ జిల్లా అధ్యక్షులు పీరుబండి జైహింద్ కుమార్, ఎంపిటిసి ఎర్ర అప్పారావు, వైసిపి మండల అధ్యక్షులు జాగరపు అప్పారావు, మండల యూత్ అధ్యక్షులు కొండల విజయ్, పొటుపు రెడ్డి వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.



చెట్టు వద్ద పూజలు చేస్తున్న జెడ్‌పి చైర్మన్ శ్రీనివాసరావు

మహిళలకు ఆరోగ్య పరీక్షలు అవసరం

ప్రజాశక్తి- బొండపల్లి

మహిళలకు ఆరోగ్య పరీక్షలు అవసరమని స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి జి.సమీరా అన్నారు. బొండపల్లిలో మంగళవారం స్వస్థ నారీ స్వశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎన్‌టిఆర్ వైద్య సేవ జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ సాయిరాం సందర్శించి తగు సూచనలు చేశారు. మాజీ జెడ్‌పిటిసి బండారు బాలాజీ మాట్లాడుతూ డ్వాక్రా మహిళలు ఎక్కువ మంది ఆరోగ్య పరీక్షలు చేసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో మహిళలకు కేన్సర్, స్క్రీనింగ్, మధుమేహ, రక్తపోటు తదితర పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. ఇందులో భాగంగా స్థానిక అంగన్వాడీ కార్యకర్తలు పోషకాహార స్టాల్స్ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఆయుష్ వైద్యాధికారి డాక్టర్ సునీత, సిహెచ్ఒ కర్ణ, ఎంపిహెచ్ఇఒ తిరుపతిరావు, హెల్త్ సూపర్‌వైజర్ ఎస్‌ఎ బాషా, వైద్య సిబ్బంది, అంగన్వాడీలు పాల్గొన్నారు.

గజపతినగరం: కెంగువ గ్రామంలో మంగళవారం స్వస్థ నారీ స్వశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి మహిళా తప్పనిసరిగా పోషకాలతో కూడిన ఆహారం తీసుకోవాలని, పరిసరాల పరిశుభ్రత తోనే మంచి జీవన విధానానికి శ్రీకారం చుట్టాలని అది కేవలం మహిళలతోనే సాధ్యమని సర్పంచ్ ప్రతినిధి లెంక గణేష్ అన్నారు. ఈ కార్యక్రమంలో మరుపల్లి పిహెచ్‌సి వైద్యులు డాక్టర్ శుస్మ, వైద్య సిబ్బంది, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

డిసిఎల్ కార్యాలయం వద్ద ధర్నా

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

పని గంటల పెంపును నిరసిస్తూ డిప్యూటీ లేబర్ కార్యాలయం వద్ద ఎఐసిటియు ఆధ్వర్యాన కార్మికులు మంగళవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా నాయకులు మద్ది అప్పలరాజు, గిరి ప్రసాద్ మాట్లాడుతూ చట్టాల్లో విశ్రాంతి సమయంతో కలిపి పది గంటలకు మించి కార్మికులు పనిచేయ వలసిన అవసరం లేదని, కానీ రోజుకు 13 గంటలు పని చేయాలని చట్టాలను సవరిస్తూ అసెంబ్లీలో బిల్లు ప్రవేశపెట్టడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. 13గంటలకు పనిని రద్దు చేయాలని, రాత్రిపూట మహిళలు నైట్ డ్యూటీ సవరణ వెనక్కి తీసుకోవాలని, 8గంటల పని దినం అమలు చెయ్యాలని నినదించారు. అనంతరం ఎసిఎల్, ఆర్.రమాదేవి, ఎసిఎల్ ఓ.శ్రీనివాసరావుకు వినతి అందజేశారు.

నెల్లిమర్ల: పని గంటలు పెంచుతూ ప్రభుత్వం చట్టాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని సిపిఐ నాయకులు మొయిద పాపారావు డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎనిమిది గంటల పని విధానాన్ని 13 గంటలకు పెంచుతూ ప్రభుత్వం తీసుకువచ్చిన చట్టాన్ని కార్మికవర్గం వ్యతిరేకించాలని కోరారు. మహిళలు నైట్ డ్యూటీ చేస్తూ అవకాశం కల్పించిన బిల్లును మహిళలు తీవ్రంగా వ్యతిరేకించాలన్నారు.

ఎన్‌సిసికి పలువురు ఎంపిక

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

స్థానిక సీతం కళాశాలలో ఆంధ్ర కాంపోజిట్ టెక్నికల్ రెజిమెంట్, విశాఖపట్నం కమాండింగ్ ఆఫీసర్ కర్నల్ తపస్ మండల్ ఆధ్వర్యంలో ఎన్‌సిసి బాలురు, బాలికల ఎంపిక శిబిరం విజయవంతంగా నిర్వహించారు. ఈ ఎంపిక శిబిరంలో సుమారు 200 మంది సీతం కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు. అభ్యర్థులను 1600 మీటర్ల పరుగుపందెం, ఎత్తు, బరువు కొలతలు, వంద మీటర్ల స్ప్రింట్, సెటప్స్, పుషప్, లిఖిత పరీక్ష, వ్యక్తిగత ఇంటర్వ్యూల ఆధారంగా పరీక్షించారు. కార్యక్రమంలో సీతం కళాశాల ప్రధాన సంచాలకులు డాక్టర్ మజ్జి శశిభూషణ రావు మాట్లాడుతూ ఈ ఎంపిక ద్వారా విద్యార్థుల్లో శారీరక ధృఢత్వం, క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు, దేశభక్తి పట్ల ఆసక్తి పెంపొందించడమే ప్రధాన ఉద్దేశమని తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ డివి రామమూర్తి, వైస్ ప్రిన్సిపల్ వెంకట లక్ష్మి, ఎన్‌సిసి అధికారులు లెఫ్టినెంట్ ఎం. వరలక్ష్మి, లెఫ్టినెంట్ ప్రశాంత్, తదితరులు పాల్గొన్నారు.

ప్రథమ చికిత్సలపై అవగాహన

ప్రజాశక్తి- శృంగవరపుకోట

పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ఫస్ట్ ఎయిడ్ లైఫ్ సపోర్ట్ అనే అంశంపై కాలేజీ విద్యార్థులకు, లెక్చరర్లకు మంగళవారం అవగాహన కల్పించామని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఎస్.కోట బ్రాంచ్ చైర్‌పర్సన్ డాక్టర్ పి. వరలక్ష్మి తెలిపారు. ఈ కార్యక్రమాన్ని డిగ్రీ కాలేజీ రెడ్ క్రాస్ సొసైటీ వైఆర్‌సి కోఆర్డినేటర్ సిహెచ్ శ్రీనివాసరావు కోఆర్డినేట్ చేయగా కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ సిహెచ్ కేశవరావు అధ్యక్షత వహించారని అన్నారు. ఈ సందర్భంగా రెడ్ క్రాస్ జిల్లా కోఆర్డినేటర్ మన్మధరావు గుండె, ఊపిరితిత్తులు ఆగిపోయినప్పుడు వెంటనే చేయవలసిన ప్రథమ చికిత్స సిఆర్‌పి గురించి వివరించారు. పాము, కుక్క, తేలు వంటి విష సర్పాలు కాటు వేసినప్పుడు చేయవలసిన ప్రథమ చికిత్స గురించి పని ప్రదేశాలలో ప్రమాదవశాత్తు జరిగిన ప్రమాదాలు ఎదుర్కోవడానికి తీసుకోవలసిన మొట్టమొదట చర్యలు గూర్చి వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మేనేజ్మెంట్ కమిటీ మెంబర్ డి సూర్యారావు, ఎస్.కోట బ్రాంచ్ వైస్ చైర్మన్ ఏ మల్లేశ్వరరావు, ఎంసి మెంబర్ ఆర్ దుర్గాప్రసాద్, లైఫ్ మెంబర్ డాక్టర్ గణేష్, వైస్ ప్రిన్సిపాల్ వాసుదేవరావు, అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

బల్లంకిలో పశువైద్య శిబిరం

ప్రజాశక్తి- వేపాడ

మండలంలోని బల్లంకి గ్రామంలో మంగళవారం పశువైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 20 పశువులకు గర్భ కోశ వ్యాధులకు, 10 పశువులకు సాధారణ వ్యాధులకు చికిత్స చేసి పెయ్యలకు నట్టల నివారణ మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పశువైద్యాధికారి డాక్టర్ కోరాడ గాయత్రి మాట్లాడుతూ పశువుల్లో పునరుత్పత్తిపై దృష్టి సారించినప్పుడే పాడి పరిశ్రమ లాభదాయకంగా ఉంటుందన్నారు. పశువులకు పెట్టే మేతలో ఖనిజ లవణ మిశ్రమాన్ని చేర్చడం వల్ల సరైన నిష్పత్తిలో పోషకాలు అందుతాయని తెలిపారు. ఆడపెయ్యలకు క్రమం తప్పకుండా నట్టల నివారణ మందులు పట్టడం వల్ల త్వరగా ఎదుగుతాయన్నారు. పశువులు ఈనిన వెంటనే తీసుకోవాల్సిన జాగ్రత్తలు, జున్ను పాలను అప్పుడే పుట్టిన దూడలకు పట్టడం వల్ల కలిగే లాభాలు, వర్షాకాలంలో పశువులు, జీవాల యాజమాన్యంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పశుగ్రాస పెంపకం వల్ల కలిగే లాభాలు మీద అవగాహన కల్పించారు. శిబిరంలో వేపాడ పశువైద్య సిబ్బంది, పశుసంవర్ధక సహాయకులు పాల్గొన్నారు.

స్పందించారు... సరిచేశారు..

శృంగవరపుకోట: మండలంలోని భవానినగర్‌లో నాలుగు రోజుల క్రితం వీచిన ఈదురు గాలులకు స్థానిక భవాని మాత గుడి సమీపంలో గల బార్బర్ షాప్ వద్ద ఒక తాటిచెట్టు సగానికి పైగా వంగిపోయి అక్కడే ఉన్న వేరొక చెట్టు, బార్బర్ షాప్‌పై వాలిపోయింది. పక్క నుంచి వెళ్తున్న హైటెన్షన్ విద్యుత్ తీగలకు తాకుతాయేమోనని బార్బర్ షాప్ యజమాని విద్యుత్ శాఖ అధికారులకు తెలియపరిచినా స్పందించలేదు. దీంతో షాప్ యజమాని, స్థానికలు పుణ్యగిరి వర్కింగ్ జర్నలిస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్‌కు తెలియపరచడంతో వెంటనే స్పందించిన విద్యుత్ శాఖ అధికారులు హుటాహుటిన సమస్యను పరిష్కరించారు. దీనిపై స్థాని కులు యూనియన్‌కు ధన్యవాదాలు తెలుపగా పిడబ్ల్యూజేడబ్ల్యూ యూని యన్ నాయకులు, సభ్యులు వెంటనే స్పందించిన అధికారులకు ధన్యవాదాలు తెలిపారు.

నేరాలు ఘోరాలు

గాయపడిన యువకుడు మృతి

ప్రజాశక్తి - కంటోన్మెంట్

పట్టణంలోని బాలాజీ జంక్షన్ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందాడు. వన్ టౌన్ పోలీసుల కథనం ప్రకారం.. గుర్ల మండలానికి చెందిన బి.సన్యాసిరావు పద్మావతి నగర్‌లోని వసంతి విహార్‌లో వాచ్‌మెన్‌గా పని చేస్తున్నారు. తన కుమారుడు బి.గణేష్ (22) సోమవారం రాత్రి బాలాజీ జంక్షన్ నుండి ఆర్‌టిసి కాంప్లెక్స్ వైపు మందుల కొనేందుకు నడుచుకొని వస్తుండగా గుర్తుతెలియని కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో గణేష్‌కు తీవ్ర గాయాలయ్యాయి. గాయలైన గణేష్‌ను జిల్లా ప్రభుత్వ సర్వజన జన ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం ప్రయివేటు ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. విజయనగరం వన్ టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు.

పిడుగు పడి వ్యక్తి మృతి

గంట్యాడ: బొండపల్లి మండలంలోని వెదురువాడ వద్ద తోటలో మంగళవారం పిడుగు పడటంతో గంట్యాడ మండలం పెదమజ్జి పాలెం గ్రామానికి చెందిన సుంకరి సూర్యనారాయణ(63) అక్కడికక్కడే మృతి చెందారు. తహశీల్దార్ రాజేశ్వరరావు తెలిపిన వివరాలు ప్రకారం.. పెదమజ్జి పాలెం గ్రామానికి చెందిన సూర్యనారాయణ వెదురువాడ సమీపంలోని తోటల్లోకి పశువులను మేతకు తీసుకెళ్లాడు. వర్షం కారణంగా పిడుగు పడటంతో ఆయన మృతి చెందాడు. విఆర్‌ఒ బొండపల్లి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

పశువుల కాపరి గల్లంతు

మెంటాడ: మెంటాడ గ్రామానికి చెందిన చల్ల కృష్ణ(43) అనే వ్యక్తి మంగళవారం చంపావతి నదిలో పడి గల్లంతయ్యాడు. మధ్యాహ్నం మేతకోసం పశువులను చంపావతి నది అవతల వైపు పొలాల్లోకి తీసుకెల్లారు. ఉరుములు మెరుపులతో కూడిన వర్షం కురవడంతో చంపావతి నదీ ప్రవాహం పెరగింది. ఈ నేపథ్యంలో కృష్ణ నది మధ్యలో ఉన్న కరెంటు స్తంభాలపై నుంచి నడుస్తూ పశువులను నది దాటించే ప్రయత్నంలో వాటిని అదిలిస్తుండగా పట్టుతప్పి నదిలో జారి పడిపోయాడు. ప్రవాహ ఉధృతికి కొట్టుకుపోయాడు. విషయం తెలుసుకున్న స్థానికులు గాలించినా ఆచూకీ దొరకలేదు. గాలింపు కొనసాగుతోంది.

వనరులను వినియోగించుకోవాలి

ప్రజాశక్తి- గంట్యాడ

ప్రభుత్వం అందించిన వనరులను గ్రామస్తులు సక్రమంగా వినియోగించుకోవాలని ఐసిడిఎస్ సూపర్‌వైజర్ అనురాధ అన్నారు. గోడియాడ గ్రామంలో మంగళవారం ఎనిమిదవ రాష్ట్రీయ పోషణ మాసోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అవకాశం ఉన్నంతవరకు ఎరువులు లేకుండా పండించే ఆకుకూరలు కాయగూరలను తీసుకోవాలన్నారు. అంగన్వాడి కార్యకర్తలు స్థానికంగా లభించే మట్టితో బొమ్మలు, పేపరు ఉపయోగించి పండ్లు, పూలు, మనుషులు బొమ్మలు, కర్ర బొమ్మలు తయారు చేసి చూపించారు. ఖర్చు లేకుండా తక్కువ ఖర్చుతో మంచి బొమ్మలను తయారు చేసి పిల్లలతో ఆటపాటలకు ఉపయోగిస్తున్నట్లు తెలిపారు.